
మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310


### కూటమి ప్రభుత్వంలో గ్రామాలు
## అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి



3లో..

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 05 శనివారం 31 - 05 - 2025 పేజీలు: 8 వెల: 4

# ప్రతిఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి




- సంపద సృష్టి జరగాలి.. అది పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యం
- సరైన సమయంలో దేశానికి ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారు
- సరైన పాలసీలు రూపొందిస్తే మన ప్రగతిని ఎవరూ ఆపలేరు
- ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన

మన గళం, న్యూఢిల్లీ : ఉమ్మడి ఏపీలో సీఐఐ సదస్సులు నిర్వహించానని, తాను మొదటి నుంచి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడువ్యాఖ్యానించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చాయని ఉద్ఘాటించారు. 1990లోనే ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని గుర్తుచేశారు. దావోస్‌లో ఏటా పారిశ్రామికవేత్తల సదస్సు జరుగుతుందని తెలిపారు. గతంలో దావోస్ వెళ్లవద్దని కొందరు తనకు సూచించారని.. ప్రముఖులతో సంబంధాల దృష్ట్యా పేదలు ఓట్లు వేయరని చెప్పారని గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రధాని కూడా దావోస్ వెళ్లలేదని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.

1995 నుంచి తాను మాత్రమే దావోస్‌కు తరచూ వెళ్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. సంపద సృష్టి జరగాలి.. అది పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమని ఉద్ఘాటించారు. సంపద సృష్టి ద్వారానే ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. ఇవాళ(శుక్రవారం) ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా సీఐఐ సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు ఏపీ అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ విధానాలను 2లో..

### ఆర్టికల్ 370 రద్దు తర్వాత
## కశ్మీర్ వికసిస్తోంది



మన గళం, న్యూఢిల్లీ : ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ వికసిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ దుర్నీతిని ఎండగట్టేందుకు ఎంపీల బృందం ఇండోనేషియాలో పర్యటిస్తోంది. ఈ బృందంతో పాటు సల్మాన్ ఖుర్షీద్ కూడా ఆ దేశంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా 2లో..



### ఎట్టకేలకు న్యాయం
## జరిగింది

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన అంకితా భండారి కేసులో ముగ్గురు నిందితులకు ఉత్తరాఖండ్ స్థానిక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2022లో ఉత్తరాఖండ్ లో సంచలనం రేపిన హెూటల్ రిషెప్సనిస్ట్ హత్య కేసులో సంచలన తీర్పు 2లో..

### త్వరలో ఏపీకి అంతర్జాతీయ
## కంపెనీలు రాబోతున్నాయి



- సీఏ విద్యార్థుల జాతీయ సదస్సులో మంత్రి నాదెండ్ల ప్రసంగం
- రాజకీయ నాయకులకు సీఏలు, లాయర్ల అవసరం తప్పనిసరి అని వ్యాఖ్య

మన గళం, అమరావతి : తాను కూడా చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) కావాలని ఆశించి, ఆర్టికల్స్ కూడా పూర్తి చేశానని, కానీ చివరికి రాజకీయ నాయకుడి నయ్యానని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడలో జరిగిన ఐసీఏఐ జాతీయ విద్యార్థుల సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొన్ని లెక్కలకు సంబంధించి ఆరేళ్ల తర్వాత ఆడిటింగ్ నిర్వహించడం ఆశ్చర్యం కలిగిస్తోందని, ప్రభుత్వ లెక్కల 2లో..




## నిరుద్యోగులకు అలర్ట్

**న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.**

మన గళం, అమరావతి : నిరుద్యోగులకు మరో గుడ్‌న్యూస్. ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ఖాళీగా ఉన్న 245 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వివిధ కేటగిరీల్లో రెగ్యులర్ బేస్‌లో 242, అలాగే కాంట్రాక్ట్ పద్ధతిలో 3 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని హైకోర్టు, ప్రభుత్వ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు భర్తీకి రంగం సిద్ధం చేశారు. పోస్టుల పేర్లు, వివరాలు, అర్హత, వయోపరిమితి, జీతం, దరఖాస్తు ప్రక్రియ, ప్రారంభ, చివరి తేదీ, ఫీజు, ఎంపిక 2లో..

### లిక్కర్ స్కాంలో
## నిందితుల విచారణ



మన గళం, విజయవాడ : ఏపీలో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాంలో నిందితుల విచారణ కొనసాగుతోంది. ఏసీబీ కోర్టు అనుమతితో లిక్కర్ స్కాంలో నలుగురు నిందితులను ఈరోజు (శనివారం) ఉదయం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. నలుగురు నిందితులను సిట్ చీఫ్ రాజశేఖర్ బాబు నేరుగా విచారించారు. దాదాపు ఐదు గంటలుగా విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితు ఏ1 రాజ్ కసిరెడ్డితో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ చీఫ్ విచారించారు. స్కాంలో ఈ నలుగురి పాత్ర కీలకంగా ఉందని ఇప్పటికే సిట్ గుర్తించిన విషయం తెలిసిందే. కస్టడీలో భాగంగా స్కాంలో 2లో..

### దేశ వ్యాప్తంగా
## విజృంభిస్తోన్న కరోనా



మన గళం, న్యూఢిల్లీ : కరోనా ప్రపంచాన్ని మరోసారి అతలాకుతలం చేస్తోంది. అమెరికా, సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్ దేశాలలో ఇప్పటికే పలు ఆసుపత్రులు కరోనా కేసులతో 2లో..

### నాలుగు రోజుల
## పాటు భారీ వర్షాలు



మన గళం, హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడి.. బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ మధ్య 2లో..

## గిరిజనుల సమస్య తీరింది



మన గళం, అల్లూరి సీతారామరాజు జిల్లా : ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు అల్లూరి జిల్లా లక్కవరం నుంచి చీడిగొంద వరకూ రహదారిని నిర్మించినట్లు పవన్ తెలిపారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు లక్కవరం నుంచి చీడిగొంద వరకూ రూ.87.19 లక్షల వ్యయంతో 1.01కి.మీ. రహదారిని నిర్మించినట్లు ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. గిరిజన గ్రామాలు, ప్రాంతాలకు 2లో..



### వాస్తవాల ప్రాతిపదికన
## పథకాలు తీసుకొస్తాం

మన గళం, హైదరాబాద్ : తెలంగాణలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నేర్చుకునే సామర్థ్యం, పని, కుటుంబ పరిస్థితులపై సెస్ సర్వే చేయడం అభినందనీయమని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈరోజు (శనివారం) బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ 2లో..

# ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ వికసిస్తోంది

మొదటిపేజీ తరువాయి గురువారం అక్కడ ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఖుర్షీద్ మాట్లాడారు. 'ఆర్టికల్ 370 తో కశ్మీర్ ఓ ప్రత్యేకమైన ప్రాంతమనే భావన ఉండేది. భారత్ లో అంతర్భాగంగా ఉన్నట్లు అనిపించేది కాదు. తాము విడిగా ఉన్నామనే అభిప్రాయం అక్కడ చాలామందిలో ఉండేది. అయితే, 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేశాక ఈ భావన తొలగిపోయింది. ఈ నిర్ణయం జమ్మూకశ్మీర్ లో అభివృద్ధికి బాటలు వేస్తోంది. కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేశాక అక్కడ ఇటీవల జరిగిన ఎన్నికల్లో 65 శాతం ఓట్లు పోలవడమే దీనికి నిదర్శనం' అని ఖుర్షీద్ అన్నారు. అయితే, గతంలో ఆర్టికల్ 370పై సల్మాన్ ఖుర్షీద్ భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ఖుర్షీద్ స్పందిస్తూ.. ఆర్టికల్ 370 అనేది జమ్మూకశ్మీర్ ను భారత్ తో కలిపి ఉంచేందుకు మార్గం చూపిందని అప్పట్లో వ్యాఖ్యానించారు. కాగా, బీజేపీపై కాంగ్రెస్ సీనియర్ నేతలు వరుసగా ప్రశంసలు కురిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఇప్పటికే బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతుండగా, ఇప్పుడు సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ కూడా పరోక్షంగా బీజేపీని మెచ్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారింది.

# ఎట్టకేలకు న్యాయం జరిగింది

మొదటిపేజీ తరువాయి వెల్లడించింది ఉత్తరాఖండ్ కోర్టు. ఈ కేసులో బీజేపీ మాజీ నేత కొడుకు పుల్కిత్ ఆర్యతో పాటు మరో ఇద్దరు సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను దోషులుగా నిర్ధారించింది కోర్టు.

పౌరి జిల్లాలోని యమకేశ్వర్ ప్రాంతంలో రిసార్ట్‌లో పనిచేస్తున్న అంకితను లైంగిక వాంఛ తీర్చలేదని ఆమె పని చేసే రిసార్ట్ ఓనరే ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో ముగ్గురు నిందితులకు ఉత్తరాఖండ్ స్థానిక కోర్టు జీవిత ఖైదు విధించింది. అంకిత భండారి సెప్టెంబర్ 18, 2022న కనిపించకుండా పోయినట్లు కేసు నమోదయ్యింది. ఆ రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆమె పుల్కిత్ ఆర్య, రిసార్ట్ మేనేజర్ సౌరభ్ భాస్కర్, మరొక ఉద్యోగి అంకిత్ అలియాస్ పుల్కిత్ గుప్తాతో కలిసి రిషికేశ్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. రిషికేష్ నుండి తిరిగి వచ్చే సమయంలో నలుగురు చిలా రోడ్డులో ఉన్న ఒక కాలువ దగ్గర ఆగినట్లు తెలుస్తోంది. అక్కడ నిందితులు ముగ్గురు మద్యం సేవించి, అంకితను లైంగికంగా వేధించగా అంకిత తిరస్కరించడంతో ఆగ్రహించిన ముగ్గురు నిందితులు ఆమెను కాలువలోకి తోసేసి చంపేశారు. ఈ సంఘటన అప్పట్లో జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ముందస్తు దర్యాప్తులో వైఫల్యం, రాజకీయ ఒత్తిడి కారణంగా కేసు పక్కదోవ పట్టిస్తున్నారంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో 97 సాక్షులుగా పేర్కొంటూ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది సిట్ బృందం.. వీరిలో 47 మంది పేర్లను మార్చి 28, 2023న తొలగించారు. పుల్కిత్ ఆర్య, మరో ఇద్దరు నిందితులకు ఉత్తరాఖండ్ స్థానిక కోర్టు జీవిత ఖైదు విధించింది.

# దేశ వ్యాప్తంగా విజృంభిస్తోన్న కరోనా

మొదటిపేజీ తరువాయి నిండిపోయాయి. క్రమంగా భారతదేశంలో కూడా కరోనా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దేశంలో 1,828 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. 15 మంది కరోనాతో మృతి చెందారు. అందులో ఆరుగురు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు. గుజరాత్‌లో గురువారం ఆరు కొత్త కేసులు నమోదయ్యాయి. వారిలో 8 నెలల శిశువు కూడా ఉంది. ప్రస్తుతం ఆ శిశువు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కేరళలో మొత్తం 727 యాక్టివ్ కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో ఓమిక్రాన్ వేరియంట్ కేసులు పెరుగుతున్నాయని ముఖ్యమంత్రి విజయన్ ధృవీకరించారు. జనవరి నుంచి మహారాష్ట్ర కోవిడ్ పరీక్షలు నిర్వహించగా మొత్తం ఇప్పటి వలరకు 9,500 కి పైగా కేసులు నమోదు అయ్యాయి. గురువారం ఒక్క రోజే 79 కొత్త కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది. ముంబైలో 373 కేసులు పెరిగాయి. జమ్మూ కాశ్మీర్‌లో గురువారం రెండు కొత్త కేసులు నిర్ధారించారు. అటు ఏపీలోనూ కరోనా కేసులు నమోదు అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా క్రమంగా కరోనా కేసులు పెరుగుతునే ఉన్నాయి. కరోనాలో అనేక కొత్త రకాలు వస్తున్నాయని ఇటీవల తెలిపింది.

# వాస్తవాల ప్రాతిపదికన పథకాలు తీసుకొస్తాం

ప్రాంగణంలో యంగ్ లైవ్స్ రౌండ్ – 7 సర్వే నివేదికను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సర్వే నివేదికలు విధాన రూపకల్పనలో ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనాల వల్ల ప్రభుత్వ విధానాల్లో ఏవైనా లోటు పాట్లు ఉంటే సవరించుకోవచ్చని చెప్పారు. తెలంగాణలో విద్య, వైద్యం, పౌష్టికాహారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వ హాస్టల్లలో మెరుగైన విద్యతో పాటు, మెరుగైన భోజన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. సరైన పౌష్టికాహారం లేకపోతే విద్యార్థులు విద్య మీద దృష్టి సారించలేకపోతున్నారని అన్నారు. ఒక ఆదివాసి బిడ్డగా తనకు ఆకలి బాధ తెలుసన్నారు. అందుకే ఎక్కడ ఫుడ్ గ్యాప్స్ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అమ్మాయిల్లో రక్తహీనతను నివారించేందుకు పోషకాలతో కూడిన చిక్కిల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. సెస్ నిర్వహిస్తున్న సర్వేలకు, అధ్యయనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సెస్ ఇచ్చే వాస్తవాల ప్రాతిపదికన ప్రజా సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకొస్తామన్నారు. సర్వేలు కేవలం సర్వేల కోసమే జరగకూడదని.. ప్రజల సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, విధానపరమైన లోటు పాట్లు తెలిపేలా సర్వేలు జరగాలని అన్నారు.

# త్వరలో ఏపీకి అంతర్జాతీయ కంపెనీలు రాబోతున్నాయి



విషయంలో ఇంత జాప్యం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. భారతదేశంలో ఏ రాజకీయ నాయకుడికైనా చార్టర్డ్ అకౌంటెంట్ లేదా న్యాయవాది సహాయం కచ్చితంగా అవసరమని ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆధారితం నుంచి సాంకేతికత ఆధారితంగా రూపాంతరం చెందుతోందని మంత్రి తెలిపారు. కొనుగోలు శక్తిలో మన దేశం జపాన్‌ను అధిగమించిందని చెప్పారు. రాష్ట్రానికి త్వరలో అనేక అంతర్జాతీయ సంస్థలు, గ్లోబల్ చైన్లు రానున్నాయని, వాటికి సీఏల సేవలు ఎంతగానో అవసరమని అన్నారు. "ఈ ఏడాది చివరి నాటికి భారతదేశం నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది" అని ఆయన అంచనా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మనోహర్ వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడిస్తున్నామని, వాట్సాప్ ద్వారా పంట కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తే 74 వేల మంది రైతులు నమోదు చేసుకోగా, 18 వేల మంది తమ పంటను విజయవంతంగా అమ్ముకున్నారని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి తెస్తామని, రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలకు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రజలను కూడా పీ4 (ప్రజా భాగస్వామ్యం)లో భాగస్వాములను చేయడానికి కారణం, వారు కూడా దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని చెప్పడానికేనని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు అలర్ట్




మొదటిపేజీ తరువాయి ప్రక్రియ వంటి వివరాలను అధికారక నోటిఫికేషన్‌లో పొందుపరుస్తామన్నారు. కాగా ఇప్పటికే 1620 పోస్టుల భర్తీకి రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ కొనసాగుతోంది. జూన్ 2తో ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ముగియనుంది. ఈ క్రమంలో త్వరలోనే మరో నోటిఫికేషన్ కూడా విడుదల చేసేందుకు హైకోర్టు అనుమతి తెలిపింది. అర్హతలు కలిగిన నిరుద్యోగులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ నియామక ప్రకటనలు నెమ్మదిగా ఒకదాని తర్వాత ఒకటిగా వస్తున్నాయి. ఇప్పటికే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ 2025 విడుదల చేయగా.. త్వరలోనే నియామక రాత పరీక్షలు కూడా నిర్వహించనుంది. అలాగే రాష్ట్రం లోని పలు జిల్లా కోర్టుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. త్వరలోనే మరో నోటిఫికేషన్ రానుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్ లో చెక్ చేసుకోవచ్చు.

# ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి



మొదటిపేజీ తరువాయి వివరించారు. ఆదాయం పెరిగితే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని వెల్లడించారు. సరైన సమయంలో దేశానికి ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారని ప్రశంసించారు. భారత్‌కు మోదీ నాయకత్వం ప్రధాన బలమని కొనియాడారు. చైనా ఆర్థిక వ్యవస్థ భారత్‌కు నాలుగున్నర రెట్లు.. అమెరికా ఆర్థిక వ్యవస్థ భారత్ కంటే ఏడు రెట్లు ఎక్కువని వివరించారు సీఎం చంద్రబాబు.

సరైన పాలసీలు రూపొందిస్తే మన ప్రగతిని ఎవరూ ఆపలేరని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. దేశానికి రానున్న పదేళ్లు అత్యంత కీలకమని అన్నారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ.. అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని అభివర్ణించారు. ఐటీ పరిశ్రమల వల్లే హైదరాబాద్‌కు లబ్ధి జరిగిందని స్పష్టం చేశారు. 2047 విజన్ లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని వివరించారు. సాంకేతిక విప్లవంలో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. ఏపీలో 15 శాతం వృద్ధి రేటు తన లక్ష్యమని వెల్లడించారు. అమరావతిలో దేశంలోనే తొలిసారి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. విశాఖపట్నానికి టీసీఎస్, గూగుల్, మిట్టల్ పరిశ్రమలు వచ్చాయని తెలిపారు సీఎం చంద్రబాబు.

ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు. ఏడాదిలోనే ఏపీలో రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్టులతో 4.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. పారిశ్రామికవేత్తలను ఏపీకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఏపీలో పలు రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. ఏపీలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని కోరారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లదే కీలక పాత్ర అని వివరించారు. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలేనని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# గిరిజనుల సమస్య తీరింది




రహదారులు నిర్మించాలనే ఉద్దేశ్యంతో కేంద్రం చేపట్టిన పథకంలో భాగంగా ఈ రహదారిని నిర్మించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా దాదాపు 183 మంది గిరిజనులకు రహదారి సమస్య పరిష్కారం అయ్యిందని పవన్ వెల్లడించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని పవన్ చెప్పారు. అందులో భాగంగా రూ.1000 కోట్ల నిధులతో అడవి తల్లి బాట కార్యక్రమం చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గిరిజనులను అభివృద్ధికి చేరువ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

# లిక్కర్ స్కాంలో నిందితుల విచారణ

మొదటిపేజీ తరువాయి వసూలు చేసిన డబ్బును ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు, ఎక్కడ ఖరీదైన ఆస్తులు కొన్నారని నిందితులను సిట్ చీఫ్ ప్రశ్నించారు. ఖరీదైన కార్లు ఎవరి కోసం కొన్నారని ప్రశ్నలు సంధించారు. అలాగే నిందితుల కుటుంబ సభ్యుల వ్యాపారాల్లో పెట్టుబడులుగా వచ్చిన డబ్బుల గురించి బ్యాంక్ అకౌంట్స్ ఆధారంగా నిందితులను ప్రశ్నించారు సిట్ చీఫ్. 2019 – 2024 సమయంలో నిందితులు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను రిజిస్ట్రార్ శాఖ నుంచి సిట్ సేకరించింది. దీంతో ఈ ఆస్తుల వివరాలపై నిందితులను సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. లిక్కర్ కేసులో సిట్ అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని సిట్ అరెస్ట్ చేసింది. వారిలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి సూత్రధారి, పాత్రధారిగా ఉన్నట్లు సిట్ గుర్తించింది. ఆయన తరువాత అరెస్ట్ చేసిన సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణుక్య, దిలీప్ పాత్ర కొంత మేరే అని సిట్ విచారణలో బయటపడింది.

# నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి తీరం దాటింది. ఇది రానున్న 12 గంటల్లో మరింత బలహీన పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలు చోట్ల పిడుగులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారినందున కోస్తా ప్రాంతంలోని మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లరాదని ప్రభుత్వం హెచ్చరించింది. ఇక వాయుగుండం, నైరుతి రుతుపవనాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో వర్షాలు కురుస్తాయిని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. కోస్తాంధ్రలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు.. రాయలసీమలో నంద్యాల, వైఎస్ఆర్ కడప, తిరుపతి జిల్లాల్లో తెలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది.

# పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

- టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతం కావాలి
- ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




మన గళం,కర్నూలు కలెక్టరేట్ : పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువు లోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు... పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు సంబంధించి 09 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఈ ఈ ని ఆదేశించారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ ఆరా తీశారు..ల్యాండ్ లెవెలింగ్, ముళ్ళ పొదల తొలగింపు పూర్తయిందని, సోమవారం మెటీరియల్ వస్తోందని ఏపీఎంఐపీ పిడి కలెక్టర్ కు వివరించారు. ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు దేవనకొండ మండలం ఈదుల దేవర బండ గ్రామంలో 10 ఎకరాలను కేటాయించడం జరిగిందని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో %మీావీజు% పార్కు ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఇందుకు సంబంధించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.. బనవాసి టెక్స్టైల్ పార్కు లో త్వరితగతిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు..అలాగే మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జిఎం ను ఆదేశించారు.. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కి నీటి సరఫరా పైపు లైన్ నిర్మాణపు పనులు ఎంత వరకు వచ్చాయని ఏపీఐఐసీ జడ్ఎం ను అడిగి తెలుసుకున్నారు.. 70 శాతం పూర్తి అయ్యాయని జడ్ఎం కలెక్టర్ కు వివరించారు.. జూలై లోపు పైప్ లైన్ నిర్మాణపు పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు...దూపాడు - బేతంచెర్ల రైల్వే లైన్ ఏర్పాట్లు భూసేకరణ చేయాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.. రైల్వే లైన్, నీటి పైప్ లైన్, ఎయిర్ పోర్టు లు పరిశ్రమలకు కనెక్ట్ అయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, గ్రీన్ కో తదితర కంపెనీ ల ద్వారా స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిఎం ను ఆదేశించారు.. ఇందుకు సంబంధించి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. పీఎం విశ్వకర్మ పథ కానికి సంబంధించి 2135 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, వీటి మంజూరు ప్రగతికి సంబంధించి చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జిఎం ను ఆదేశించారు..కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి సరఫరాకు సంబంధించి ఎస్టిమేట్స్ వేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..

రూ.1.08 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం : పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24 క్లెయిమ్ లకు రూ.1.08 కోట్లకు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ క్రింద 5 క్లెయిమ్స్ కు సంబంధించి రూ. 36,29,038/-, విద్యుత్ ఖర్చు రీయింబర్స్మెంట్ క్రింద 9 క్లెయిమ్స్ కు సంబంధించి రూ.38,76,577/-, వడ్డీ రాయితీ రీయింబర్స్మెంట్ క్రింద 10 క్లెయిమ్స్ కు సంబంధించి రూ.33,05,956/- లు పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కేటగిరీల వారీగా జనరల్ క్రింద 6, ఎస్సీ క్రింద 18 మొత్తంగా 24 మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు.

రూ.1.61 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం : పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24 క్లెయిమ్ లకు రూ.1.61 కోట్లకు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ క్రింద 17 క్లెయిమ్స్ కు రూ. 1,57,50,166/- , వడ్డీ రాయితీ కింద ఒక క్లెయిమ్ కు రూ. 13,813/-, విద్యుత్ ఖర్చు రీయింబర్స్మెంట్ క్రింద ఒక క్లెయిమ్ కు సంబంధించి రూ 36,663/-, సేల్స్ టాక్స్ రీయింబర్స్మెంట్ క్రింద 5 క్లెయిమ్స్ కు సంబంధించి రూ.3,35,265/- లు పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కేటగిరీల వారీగా జనరల్ కేటగిరీ లకు 7, ఎస్సీ లకు 15, ఎస్ టి లకు 2 మొత్తంగా 24 మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్చార్జ్ జిఎం అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీ ఎంఐపీ పిడి ఉమా దేవి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఇతర శాఖల జిల్లా




# కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి



-ఎం.పి. బస్తిపాటి నాగరాజు

మన గళం,కర్నూలు రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. కర్నూలు మండలం రేమట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఊరవాకిలిని కే.డి.డి. సి బ్యాంక్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు...అనంతరం ఎం.పి నాగరాజు గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యల పై ఆరా తీశారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపి ప్రభుత్వం పంచాయితీ నిధులను దారి మల్లించి గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీ లకు ప్రత్యేక నిధులు విడుదల చేసి అభివృద్ధి చేస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ద వెంకన్న , గ్రామ టిడిపి నాయకులు ఊరవాకిలి వెంకటేశ్వర్లు , శేఖర్ , రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంచనాలకు మించి మహానాడు విజయవంతం




- శాలివాహన కార్పోరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్

మన గళం,కర్నూలు సిటి : కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అడ్డాగా మారిందని శాలివాహన కార్పోరేషన్ రాష్ట్ర ఛైర్మన్ రాజేష్ కర్నూలులో అన్నారు. మహానాడు జనసమీకరణ కు సంబంధించి కర్నూలు జిల్లా ఇంచార్జ్ గా రాజేష్ వ్యవహరించారు. మహానాడు కార్యక్రమం విజయవంతం కావడంతో ఆయన కర్నూలు లో మీడియా సమావేశం నిర్వహించారు. ఎప్పుడు జరగనంతగా కడపలో నిర్వహించిన మహానాడు కార్యక్రమం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. మహానాడు సభ విజయవంతం కావడానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే మాధవి రెడ్డి తో పాటు కడప జిల్లా తెదేపా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు జిల్లా నుంచి భారీ సంఖ్యలో మాహానాడు సభకు తరలివచ్చారన్నారు. తనకు సహకరించిన మంత్రి టీజీ. భరత్ కు స్థానిక తెదేపా నేతలను రాజేష్ ధన్యవాదాలు తెలిపారు.

# దేవాలయం భూములను కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం చీకటి జీవోను తీసుకొచ్చింది



-వైకాపా కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు ఎస్.వి.మోహన్ రెడ్డి

మన గళం,కర్నూలు సిటి : దేవాలయ భూములను కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం చీకటి జీఓను తీసుకు వచ్చిందని - వైకాపా కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు ఎస్.వి.మోహన్ రెడ్డి ఆరోపించారు. శు క్రవారం నగరంలోని స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ లో ఏర్పటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. న్యాయ పోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని, ప్రజలను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎండోమెంట్ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎటువంటి హక్కు లేదు. దీనిపై ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. పప్పులు, బెల్లం అని దేవాలయ భూములను పంచుకుంటే తాము ఊరుకోమని, క్యాబినెట్ లో ఈ నిర్ణయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యతిరేకించాలన్నారు. దేవాలయం భూముల లీజ్, జీవో లపై కూటమి ప్రభుత్వం లో భాగస్వామ్యం అయిన బిజేపి పార్టీ నేతలు స్పందించాలన్నారు. దేవుడికి ద్రోహం చేసేందుకు చంద్రబాబు, కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దీనిని వ్యతిరేకిస్తూ,న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు. ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచి మోసం చేస్తున్నారన్నారు. మహానాడులో జగన్ పై విమర్శలకు పరిమితమయ్యారని, సూపర్ సిక్స్ హామీల ఊసే లేదన్నారు. ప్రభుత్వ భూములు అస్మదీయులకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని, ఎండోమెంట్ ల్యాండ్స్ టిడిపి నేతలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. సనాతన ధర్మం కాపాడే పవన్ కల్యాన్ ఎక్కడున్నాడో తెలియడం లేదని, హిందూ దేవాలయ భూములు కొట్టేస్తుంటే పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదు..? అని ఆయన ప్రశ్నించారు. హిందు ధార్మిక సంఘాలు అన్ని భూముల పరిరక్షణకు ముందుకు రావాలని, దేవాదాయ భూముల రక్షణకు వైసిపి న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. దేవాదాయ భూముల సవరణ బిల్లును పవన్ కళ్యాణ్ వ్యతిరేకించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎండియు ఆపరేటర్ల పై రాజకీయ కక్ష సాధింపు మానుకోవాలి

- ఏం డి యు ఆపరేటర్లను కొనసాగించాలి
- జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు




మన గళం,కర్నూలు సిటి : ప్రజా పంపిణీ వ్యవస్థలో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ద్వారా సరఫరా చేస్తున్న ఆపరేటర్లను జూన్ 1 నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని 2007 వరకు ఉన్న అగ్రిమెంటును దృష్టిలో పెట్టుకొని వారిని వెంటనే కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయం నందు సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో 9220 ఎండియు వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని సరఫరా చేశారని కోట్లాదిమంది లబ్ధిదారులకు ఇది బాగా ఉపయోగపడిందని ఈ వాహనాలపై ఆధారపడి ఆపరేటర్లు అసిస్టెంట్లు దాదాపు 20 వేల మంది ఉన్నారని వీరిని అర్ధాంతరంగా తొలగించడం వాహనాలను రద్దు చేయడం ప్రభుత్వానికి తగదని ఇప్పటికే నిరుద్యోగ సమస్య రాష్ట్రంలో తాండవిస్తుందని ఆ సంఖ్యలో ఈ ఆపరేటర్లు అసిస్టెంట్లు చేరుతారని ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా వీరిని తొలగించడం ప్రభుత్వ నిరంకుషత్వానికి నిదర్శనం అని వారన్నారు పేద ప్రజలకు ఇంటింటికి బియ్యం సరఫరా వల్ల వారి సమయం ధనం ఆదా అవుతుందని తిరిగి ప్రజా పంపిణీ డీలర్ల ద్వారా బియ్యం తీసుకోవాలంటే వినియోగదారులకు అదనపు ఖర్చులు అవుతుందని వారున్నారు గత ప్రభుత్వం నియమించడం వల్లే ఈ ప్రభుత్వం వారిని కొనసాగించలేకపోతుందని ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు తప్ప ఇంకోటి కాదని వారన్నారు ప్రభుత్వం తక్షణమే ఆలోచించి తొలగించిన ఆపరేటర్లను అసిస్టెంట్లను కొనసాగించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరన్న నాగేశ్వరరావు, సాయిబాబా, మారెళ్ళ రామాంజనేయులు,, ప్రభాకర్ నారాయణ స్వామి

## కార్మికుల హక్కులు కాపాడుకోవడం కోసం మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కండి


- సిఐటియు నేతల పిలుపు

మన గళం,కర్నూలు సిటి : సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 55వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా (కొత్త బస్టాండ్ ) కార్మికకర్షక భవన్ నందు సిఐటియు జండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంసిఐటియు నగర అధ్యక్షులు ఆర్ నరసింహులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ గారు సిఐటియు జెండాను ఆవిష్కరణ చేశారు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ నగర నాయకులు టి రాముడు గారులు జండా ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సిఐటియు కార్మిక సంఘం 1970 మే 30 తారీఖున కార్మికుల కోసం ఐక్యత పోరాటం అనే నినాదంతో సిఐటియు కార్మిక సంఘం ఏర్పడింది ఆనాటి నుండి ఈనాటి వరకు వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ పని భద్రత కార్మికుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తూ కోట్లాది మందితో సభ్యత్వం కలిగి భారతదేశం లో అతిపెద్ద కార్మిక సంఘంగాఅభివృద్ధి చెంది కార్మికులకు రక్షణ కవచంగా ఉన్నది. పాలించే ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తూ కార్పొరేట్లకు అనుకూలమైన చట్టాలు తీసుకువస్తున్నాయి దీనికి వ్యతిరేకంగా సిఐటియు నికరంగా నిలబడి కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపైన కార్పొరేట్ శక్తులపైన నిరంతర పోరాటం చేస్తూ కార్మికుల జోలికొస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరిక చేస్తూ నిరంతర కార్మికుల హక్కులకై పోరాటం చేస్తున్నది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి మూడవసారి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులు హరించడం కోసం వారి సంక్షేమాన్ని విస్మరించడం కోసం నూతన కార్మిక చట్టాలను తీసుకువస్తున్నది. వేతనాలు తగ్గించడం పని గంటలు పెంచడం పని భద్రత లేకుండా చేయడం యజమానులకు అనుకూలంగా చట్టాలను చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నూతన చట్టాలను రద్దు చేసేంతవరకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. అన్నదమ్ముల వలె కలిసి ఉన్నటువంటి భారతదేశ ప్రజలను కులం మతం ను అడ్డుపెట్టుకొని మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కదారి మళ్లించడం కోసం మత రాజకీయాలు చేస్తున్నాయి దీనిని కార్మిక వర్గం ఎప్పటికప్పుడు సంఘటితంగా తిప్పి కొట్టాలి. సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు కార్మిక వర్గం ప్రతిజ్ఞ పునాలి అన్నారు హమాలీ ఆటో ఆశ అంగన్వాడి భవన నిర్మాణకాంట్రాక్టుఔట్సోర్సింగ్ మొదలగు కార్మిక వర్గం అందరూ ఐక్య పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వ మెడలు ఉంచడం కోసం జులై నెల తొమ్మిదో తారీఖున దేశవ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగింది సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు విజయుడు బతకన్న వేర్ హౌస్ హమాలీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం మల్లికార్జున విష్ణుమూర్తి యూనియన్ నాయకులు చెన్నయ్య సామేలు టీకే మధు ఇసాక్ జయన్న మద్దిలేటి మునేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు జెండావిష్కరణ





మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు పట్టణంలో నేడు ఐక్యత పోరాటం ద్వారా కార్మిక కర్షక రాజ్యస్థాపనే సిఐటియు లక్ష్యంమని సిఐటియు డివిజన్ కార్యదర్శి జే, మోహన్ అన్నారు సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గూడూరులో సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల నాయకులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను సిఐటియు డివిజన్ కార్యదర్శి జే, మోహన్ ఆవిష్కరించారు,, ఈ సందర్భంగా జే,మోహన్ మాట్లాడుతూ భారత దేశంలో అనతి కాలములోనే సిఐటియు కార్మికులు, ఉద్యోగులు కర్షకులు సమస్యలపై రాజులేని ఉద్యమాలు నడిపిన సంఘం సిఐటియు నే అని కొనియాడారు 1970 సంవత్సరంలో మహారాష్ట్ర లో కార్మికులు ఉద్యమాల సందర్భంగా సిఐటియు ఏర్పడిందని నేటికీ 55 సంవత్సరములు తో ముందుకు పోతుందని తెలిపారు, 1991 కేంద్ర ప్రభుత్వం ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ అమలు చేయడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు హక్కులు కాలరాశే విధంగా కేంద్ర ప్రభుత్వం తేచ్చిన సంస్కరణలకు వ్యతిరేకంగా సిఐటియు దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో కార్మికుల సమస్యలు తీసుకొని రాజీలేని ఉద్యమాలు నడపడం వల్ల అనేక ఫలితాలు, కార్మికులకు ఉద్యోగులకు సిఐటియు అందించిందని తెలిపారు, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 2014 నుండి నేటి వరకు ఎన్డీఏ బిజెపి ప్రభుత్వాలు కార్మికులు ఉద్యోగులు పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్ లను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుంది, నియంత్రితత్వ ధోరణితో నరేంద్ర మోడీ గారు కార్మికుల హక్కులను నాశనం చేస్తున్నారని విమర్శించారు 44 కార్మిక చట్టాలను రద్దు పరచి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను తెచ్చిందని వీటికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధం కావాలని, వారు పిలుపునిచ్చారు కార్మికులకు కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తక్షణమే 26 వేల రూపాయలు ఇవ్వాలని గ్రాచుటీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు స్కీం వర్కర్లను కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని రిటైర్మెంట్ అయిన తర్వాత వీరికి 9000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు శ్రామిక మహిళలకు మెడికల్ సెలవులు సాధారణ సెలవులు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని, కేంద్ర కార్మిక సంఘాలతో ప్రాంతీయ కార్మిక సంఘాలతో మమేకమై కార్మికులు పక్షాన సిఐటియు ముందుండి అక్రమ అరెస్టుకు గాని నిర్బంధాలుగాని బెదరకుండా సిఐటియు సమరశీల ఉద్యమాలు చేస్తుందని ఆయన తెలిపారు కార్యక్రమంలో హమాలి కార్మిక సంఘం నాయకులు మద్దిలేటి, మధు, సుంకన్న, గోపి, అంజి, శేఖర్, ఆటో కార్మికులు శేఖర్, భగవాన్ దాస్, మరియు హమాలీ ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## బాల్య వివాహ నిరోధక చట్టం పై అవగాహన సదస్సు




మన గళం,కర్నూలు లీగల్ : గౌరవ స్టేట్ లీగల్ సర్వీసెస్, అమరావతి వారి ఆదేశాల మేరకు బి. లీలా వెంకట శేషాద్రి, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు "బాల్య వివాహ నిరోధక చట్టం " పై పురోహితులకు, పాస్టర్స్ కు, గవర్నమెంట్ కాజి లకు, టెంపుల్స్ ఏ. ఓ. లకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సదస్సు లో జడ్జి మాట్లాడుతు ఎవరైనా గాని బాల్య వివాహాలు చేయమని మీ దగ్గరికి వస్తే మీరు సంబధిత శాఖ లకు గాని 15100 టోల్ ఫ్రీ నంబర్ కు గాని తెలియ జె స్తే వెంటనే ఆ వివాహాన్ని అపి వేస్తామని తెలిపారు. అలాగే కొత్త చట్టాల ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష కలదని తెలిపారు. ఐసీడీస్ ఆఫీసర్ శారద మాట్టాడుతూ ప్రతి గ్రామములో గ్రామ కమిటీ లు కలవని వారికి బాల్య వివాహ లపై సమాచారం యిస్తే వెంటనే వారు ఆ వివాహన్ని అపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తారని తెలిపారు. కర్నూలు సీడీపీఓ అనురాధ మాట్టాడుతూ అంగన్వాడీ వర్కర్స్ ఎవరికైనా బాల్య వివాహ లపై సమాచారం తెలిస్తే వెంటనే మహిళ పోలీసు లకు మరియు ఐసీడీస్ ఆఫీసర్ లకు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉమాదేవి మాట్లడుతూ చిన్న పిల్లలకు వివాహాలు చేయడం వలన వచ్చే అనారోగ్య సమస్య లను గురించి వివరించారు. మహిళా పోలీస్ యస్. ఐ. కిరణ్ మాట్టాడుతూ బాల్య వివాహలు చేసిన వారికి మరియు చేయించిన వారికి కఠిన శిక్షలు కలవని తెలిపారు. ఆనంతరం బాల్య వివాహ నిరోధక చట్టం పోస్టర్స్ ను విడుదల చేశారు. ఈ సదస్సు లో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ మరియు టెంపుల్ ఈవోస్,కర్నూలు నగర బ్రాహ్మణ సంఘము అధ్యక్షులు సండే చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులు కంచు గంటల శ్యాంసుందర్, గవర్నమెంట్ ఖాజీ మౌలానా సయ్యద్ అక్బర్ పాహషా రషది,పాస్టర్ కృపాదానం రాజు, అంగన్వాడి కార్యకర్తలుపాల్గొన్నారు

## జె.వి.వి కార్యకర్తలు సామాజిక అంశాలపై శాస్త్రీయ దృష్టితో పని చేయాలి

- జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ వి బ్రహ్మారెడ్డి




మన గళం,కర్నూలు బిర్లా గేట్ : జె.వి.వి కార్యకర్తలు సామాజిక అంశాలపై శాస్త్రీయ దృష్టి తో పరిష్కారాల కోసం ప్రయత్నం చేయాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బిర్లా కాంపౌండ్ యందు వివిధ జిల్లాల నుండి వచ్చిన వేదిక కార్యకర్తల 3 రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ వేదిక కార్యకర్తల కు శాస్త్రీయ దృక్పథం అవసరమని అందుకే 3 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం అని తెలిపారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం పై అవగాహన పెంచు కోవాలని పౌరుల హక్కులు రాజ్యాంగం ద్వారా నే కాపాడ పడుతాయన్నారు... జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బర్మా సురేష్ కుమార్ మాట్లాడుతూ వేదిక విద్య, ఆరోగ్యం, పర్యావరణం, మహిళా సాధికారత మూఢ. నమ్మకాల లాంటి అంశాలపై పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందుస్తే రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల్లో జెవివి జిల్లా, మండల కమిటీలు పై రంగాల్లో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.. గత 30 సం లుగా అక్షరాస్యత, పొదుపు, విద్య,ఆరోగ్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాల తో కలిసి పనిచేశామని తెలిపారు. విద్యార్థుల్లో విద్యార్థి విజ్ఞాన వేదిక లని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విద్యార్థి నాయకులు కృష్ణాజీ, మహమ్మమద్ మియ్య,శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు రమణయ్య, సుజాత, మీనా,శాంతి, చక్రపాని, డా. కోటేశ్వర రావు ,శ్రీను, వెంకట రమణా రెడ్డి , సుధాకర్, హరేరామ్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- జిల్లా ఎస్పీ ఆదేశాలతో ముమ్మరంగా సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాలు



మన గళం,కర్నూలు క్రైం : జిల్లా ఎస్పీనూతనంగా శ్రీకారం చుట్టిన " నేను సైబర్ స్మార్ట్ " కార్యక్రమం పై వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలలో పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకూడదని లఘు చిత్రాలతో పట్టణాలు, గ్రామాలలోని ప్రధాన కూడలిలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. డిజిటల్ అరెస్టు, జాబ్ ఫ్రాడ్స్, కెవైసి ప్రాఢ్స్, ఇన్వెస్ట్ మెంట్స్ ఫ్రాడ్స్ , బ్యాంకు ఖాతాల ఓటిపిలు తెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దని , తెలియని లింకుల పై క్లిక్ చేయరాదని తెలియజేస్తున్నారు.ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి సమాచారం అందించి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన ఒక గంట లోపే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేస్తే తప్పక న్యాయం జరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్ లో బాధితులు వివరాలు నమోదు చేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పోలీసు అధికారులను సంప్రదించి సైబర్ నేరం జరిగిన వివరాలను తెలియజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 38 పోలీసు స్టేషన్ పరిధులలో మొత్తం " నేను సైబర్ స్మార్ట్ "అవగాహన కార్యక్రమాలు 1680 నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలలో 1,28,068 మంది ప్రజలకు సైబర్ నేరాల బారిన పడకూడదని అవగాహన కల్పించారు.

## ఘనంగా నిర్వహించిన సిఐటీయు 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మన గళండోన్ కార్మిక వర్గానికి అండ సిఐటియు జెండా అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,మండల కార్యదర్శి ఎ.వి.భాస్కర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్,ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్.ఎ.చిన్న రహిమాన్ అన్నారు.సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కొండపేటలోని డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం దగ్గర జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు నక్కీ శ్రీకాంత్ అధ్యక్షత వహించగా సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ విశాల భారత కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే లక్ష్యంతో.. ఐక్యత – పోరాటం నినాదంతో 1970 మే 30వ తేదీన సిఐటియు (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ఆవిర్భవించిందన్నారు.నాటి నుండి నేటి వరకు అన్ని రంగాలకు సిఐటియు విస్తరించిందని కార్మిక హక్కుల కోసం పోరాడుతూనే ఉద్యోగ, ఉపాధ్యాయ,ప్రజా సమస్యలు,రైతాంగ సమస్యలు,సామాజిక పోరాటాలకు మద్దతు ఇస్తూ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ అనేక విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నది భారతదేశంలోనే అతి పెద్ద కార్మిక సంఘం సిఐటియు సంఘం అన్నారు.అయితే ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని మతతత్వ బిజెపి కూటమి ప్రభుత్వం కార్మికులు బ్రిటిష్ కాలం నుండి పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నదని మరోవైపు పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధానాలతో వారికి అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికులను వారికి నయా బానిసలుగా మార్చే విధానాలు అవలంబిస్తున్నదని దానికి రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వంత పాడటం అత్యంత దుర్మార్గమని ఇది పాలకులు ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించి వారికి ద్రోహం చేయడమేనని వారు అన్నారు.ఏది ఏమైనా రానున్న కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను,హక్కులను కాపాడుకునేందుకు సిఐటియు ఆధ్వర్యంలో యావత్ కార్మిక వర్గం ఐక్యమై పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సిఐటియు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు టి.చంద్రశేఖర్ రెడ్డి,రామబుగ్గడు,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప,లారీ,ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## స్నానం చేసిన వెంటనే నీరసంగా అనిపిస్తుందా?



మన గళం స్నానం చేసిన తర్వాత కొందరికి అలసటగా అనిపిస్తుంది. ఇది కూడా అనారోగ్యానికి సంబంధించి శరీరం ఇచ్చే సంకేతాలలో ఒకటి. చాలా మందికి ఈ రకమైన సమస్య ఉండవచ్చు. మరి స్నానం చేసిన తర్వాత అలసిపోయినట్లు అనిపిస్తే దానికి కారణం ఏమిటి? శరీర రోగ నిరూపణ ఎలా ఉంటుంది? సాధారణంగా కొన్ని ముందస్తు అనారోగ్య సంకేతాలను మన శరీరం ఎల్లప్పుడూ మనల్ని అలర్ట్ చేస్తూ ఉంటుంది. వాటిని అర్థం చేసుకుని సకాలంలో స్పందిస్తే పెద్ద ప్రమాదాల నుంచి బయటపడొచ్చు. కానీ మనం ఆ సంకేతాలను ఎంత బాగా అర్థం చేసుకున్నామో లేదా వాటికి ఎలాంటి పరిష్కారాలను కనుగొంటామో అనేది కూడా చాలా ముఖ్యం. కాబట్టి శరీరం మనకు ఇచ్చే కొన్ని సంకేతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. ముఖ్యంగా స్నానం చేసిన తర్వాత కొందరికి అలసటగా అనిపిస్తుంది. ఇది కూడా అనారోగ్యానికి సంబంధించి శరీరం ఇచ్చే సంకేతాలలో ఒకటి. చాలా మందికి ఈ రకమైన సమస్య ఉండవచ్చు. మరి స్నానం చేసిన తర్వాత అలసిపోయినట్లు అనిపిస్తే దానికి కారణం ఏమిటి? శరీర రోగ నిరూపణ ఎలా ఉంటుంది? కొంతమంది అలసిపోయినప్పుడు స్నానం చేస్తారు. దీనివల్ల శరీరానికి కొత్త ఉత్సాహం వస్తుంది. కానీ కొంతమందికి స్నానం చేసిన తర్వాత అలసిపోయినట్లు అనిపిస్తుంది. కాబట్టి ఇలా జరగడానికి కారణం జరగడం సాధారణం కాదు. దీనికి ఓ ప్రత్యేక కారణం ఉంది. ఇది కూడా శరీరం మీకు ఇస్తున్న ఓ హెచ్చరిక. కానీ ఇలా పదేపదే జరిగితే భయపడాల్సిన అవసరం లేదు. బదులుగా కొన్ని సాధారణ పద్ధతులను అవలంబించడం ద్వారా ఈ రకమైన సమస్యను నివారించవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. చాలా మందికి స్నానం చేసిన వెంటనే అలసిపోయినట్లు నీరసించి పోతుంటారు. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. కాబట్టి ఈ సమస్య మీకూ ఉంటే స్నానం చేసే ముందు ఒక గ్లాసు నీరు త్రాగడం అలవాటు చేసుకోవాలి. ఇది రక్తపోటును సాధారణంగా ఉంచడానికి సహాయపడుతుంది. అలాగే చాలా వేడి లేదా చాలా చల్లటి నీటిలో స్నానం చేయకూడదు. ఇలా చేయడం వల్ల కూడా స్నానం చేసిన తర్వాత అలసటను నివారించవచ్చు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా ఉంటున్నాం


**– రాష్ట్ర మంత్రి టీజీ భరత్**

**– సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్**





మన గళం, కర్నూలు సిటి : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. పోదూరి లలిత అనే మహిళకు రూ.1,48,327, దినేష్ కుమార్ కు రూ.2,64,008, సయ్యద్ అంజాద్ బాషా కు రూ.45,700, పూజారి జయలక్ష్మి అనే మహిళకు రూ.15000లు చెక్కులను మంత్రి టీజీ భరత్ అందజేశారు. ఆపద సమయంలో కర్నూలు నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి టీజీ భరత్ ల మేలు మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.

## ఈ లక్షణాలు కనిపిస్తే లైట్ తీసుకోకండి..



మన గళం, ఎవరైనా సరే ప్రతి విషయం గురించి ఎక్కువగా ఆలోచించడం ప్రారంభిస్తే అది ఆరోగ్యంపై, మనసుపై, సంబంధాలపై చెడు ప్రభావం చూపుతుంది. మీరు ఏదైనా విషయంపై మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారని అనిపిస్తే.. అది అతిగా ఆలోచిస్తున్నట్టు సంకేతం. ఇది సమయానికి గుర్తిస్తే ఈ పరిస్థితిని స్వయంగా నియంత్రించవచ్చు. ఏదైనా చిన్న విషయం జరిగినా అది పూర్తయిన తర్వాత కూడా మళ్లీ మళ్లీ ఆలోచిస్తుంటే.. అది మానసిక సమస్యకు సంకేతం. ఉదాహరణకి ఎవరైనా మీతో ఏదైనా మాట చెప్పారు. ఆ విషయం అక్కడే ముగిసినా.. మీరు దాని గురించి ఎక్కువసేపు ఆలోచిస్తుంటే.. మీరు అతిగా ఆలోచిస్తున్నారని అర్థం. ఈ ఆలోచనల వల్ల తల దించుకుని కూర్చోవడం.. పని మీద దృష్టి లేకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు గతం గుర్తుకు వచ్చి ఏడవడం సహజమే. కానీ ఒకే విషయాన్ని మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుని ఏడుస్తూ ఉంటే.. అది మనసుపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది. అలాంటి వేళ మనం ఆలోచనలు కంట్రోల్ చేయలేకపోవడం వల్ల బాధ ఎక్కువవుతుంది. ఇది కూడా అతిగా ఆలోచించే లక్షణాల్లో ఒకటి. కొన్ని నిర్ణయాలు తీసుకోవడంలో ఎక్కువసేపు తీసుకోవడం.. చివరికి ఏదీ నిర్ణయించలేక పోవడం కూడా ఒక సంకేతం. ఏదైనా పని చేయాలంటే ముందుగా భయపడటం, మన అభిప్రాయాన్ని చెప్పకుండా మౌనంగా ఉండిపోవడం కూడా అతిగా ఆలోచించే లక్షణాలు. ఇలా ఉంటే పనులు ఆలస్యమవుతాయి.. అవకాశాలు చేజారిపోతాయి. రాత్రిళ్లు మనసు ప్రశాంతంగా లేకపోతే నిద్ర బాగా రాదు. నిద్రలోంచి మధ్యలో మేల్కొనడం, మళ్లీ నిద్ర పట్టకపోవడం జరిగితే ఇది మానసిక ఒత్తిడికి కారణమవుతుంది. దీర్ఘకాలంగా ఇలా జరుగుతుంటే అనేక రకాల ఆరోగ్య సమస్యలు రావచ్చు.బయటకు మాట్లాడకపోవడం కూడా అతిగా ఆలోచించటానికి ప్రధాన కారణం. మీరు మీలోనే అన్ని ఆలోచనలు దాచుకుంటే అవి పెద్ద భారంగా మారుతాయి. అందుకే నమ్మకంగా ఉన్న వ్యక్తితో మీ ఆలోచనలను చెప్పడం మంచిది. ఇలా మాట్లాడటం వల్ల మనసుకు హాయిగా అనిపిస్తుంది. మీకు ఇష్టమైన పాట విని ప్రశాంతంగా ఉండొచ్చు. దీని వల్ల కూడా మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ లక్షణాలు కనిపించినప్పుడు వాటిని అలానే వదిలేయకండి. సమస్య పెరగకుండా ముందే గుర్తించాలి. రోజూ చిన్న చిన్న విషయాలపై ఎక్కువగా ఆలోచించకుండా ఉండడానికి ప్రయత్నించండి. దీని వల్ల మీరు ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించగలరు.


# ఒళ్ళు నొప్పులు బాధిస్తున్నాయా..?



మన గళం, ఉదయం మీరు లేచిన వెంటనే శరీరం నొప్పి అనిపిస్తే దాన్ని మాములుగా తీసుకోకండి. ఈ సమస్యని కొంత మంది సాదారణంగా తీసుకుంటారు కానీ కొన్నిసార్లు ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతంగా కూడా ఉంటుంది. నిద్రపోయిన తర్వాత శరీరం తాజాగా ఉండాలి కానీ ప్రతిరోజూ నొప్పి అనిపిస్తే అది శరీరంలో ఏదో తేడా జరుగుతోందని సూచిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో అసలు కారణాలను తెలుసుకోవడం చాలా అవసరం. ఉదయం ఆరోగ్యంగా లేచి పనులు ప్రారంభించగలిగితే రోజు బాగా సాగుతుంది. కానీ ఉదయం నొప్పితో లేస్తే మనసు బాగుండదు. ఉదయం వచ్చే శరీర నొప్పి చిన్నదిగా అనిపించినా.. అది రోజంతా ప్రభావం చూపుతుంది. చాలా మంది ఉదయం శరీరం నొప్పిగా ఉందని ఫిర్యాదు చేస్తారు. అయితే ఎందుకు నొప్పిగా ఉందో వారికి స్పష్టంగా తెలియదు. ఈ సమస్యను గమనించకపోతే అది మరింత పెరిగే అవకాశం ఉంది. రాత్రిపూట కొంత మంది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతారు. ఇది ఆక్సిజన్ లోపానికి దారి తీస్తుంది. నిద్రలో శరీరానికి సరిపడా ఆక్సిజన్ లభించకపోతే ఉదయం లేచిన వెంటనే శరీర నొప్పి వస్తుంది. దీని వల్ల ఒళ్లంతా అలసటగా, బలహీనంగా అనిపించవచ్చు. ఇది గమనించాల్సిన ముఖ్యమైన కారణం. మనం పడుకునే పరుపు కూడా శరీర నొప్పికి ప్రధాన కారణం కావొచ్చు. పరుపు చాలా పాతదిగా లేదా గట్టిగా ఉంటే.. అది శరీరానికి సరైన సపోర్ట్ ఇవ్వదు. దీని వల్ల నిద్రపోతున్నప్పుడు శరీర భాగాలపై ఒత్తిడి పడుతుంది. అలాంటి పరుపుపై పడుకుంటే ఉదయం లేవగానే నొప్పి వస్తుంది. పరుపు మార్చే వరకు ఈ సమస్య అలాగే ఉంటుంది. ప్రతి ఒక్కరి నిద్రపోయే పద్ధతి వేరుగా ఉంటుంది. కొంతమంది తల ఎత్తి పడుకుంటే, మరికొంతమంది ఒక పక్కకు తిరిగి పడుకుంటారు. ఈ స్థితులలో శరీరం సరిగ్గా విశ్రాంతి తీసుకోలేకపోవడం వల్ల కొన్ని భాగాల్లో నొప్పి రావొచ్చు. మీ నిద్రపోయే పద్ధతిని మార్చుకోవడం వల్ల ఈ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ శరీర భాగాల్లో మార్పులు జరుగుతాయి. కీళ్లలో తేమ తగ్గిపోవడం, చిన్న వయస్సులోనూ వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో కూడా నొప్పి వస్తుంది. శరీరానికి సరిపడా జాగ్రత్తలు తీసుకోకపోతే రోజూ ఉదయాన్నే నొప్పితో లేచే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యలు సాదారణంగా కనిపించే విషయాలు. కానీ ఏ సమస్య అయినా ఎక్కువ రోజులు ఉంటే తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి. ఇంట్లో తీసుకునే చిన్న జాగ్రత్తలు ఉపశమనం ఇస్తాయి కానీ శాశ్వత పరిష్కారం కావాలంటే నిపుణుడి సూచన తప్పనిసరి.

# అభిమానులకు ఒక రోజు సెలవు ఇవ్వాలి!

మన గళం, అభిమాని శివానంద్ మల్లన్నవర్, =జడీ ఐపీఎల్ 2025 ఫైనల్ గెలిస్తే కర్నాటకలో ఒక రోజు సెలవు ప్రకటించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు లేఖ రాశాడు. ఈ విజయం 18 ఏళ్ల కల నెరవేర్చడం అని, ఆ రోజును "=జడీ అభిమానుల పండుగ"గా జరుపుకోవాలని కోరాడు. ఐపీఎల్ 2025లో భాగంగా గురువారం జరిగిన తొలి క్వాలిఫైయర్‌లో పంజాబ్‌ను ఓడించిన ఆర్సీబీ భారీ విజయంతో ఫైనల్లోకి ప్రవేశించింది. 18 ఏళ్లుగా ట్రోఫీ కోసం ఎదురుచూస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులు, కప్ గెలవాలనే తమ కలను చేరుకోవడానికి ఇంకా ఒక అడుగు మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలోనే ఓ ఆర్సీబీ అభిమాని ఏకంగా కర్ణాటక ముఖ్యమంత్రికి ఒక లేఖ రాశాడు. ఒక వేళ ఫైనల్లో ఆర్సీబీ గెలిస్తే.. జూన్ 4న 'ఆర్సీబీ అభిమానుల పండుగ'గా ప్రకటించి, ఒక రోజు సెలవు మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశాడు. బెల్గాం జిల్లాలోని గోకాక్‌కు చెందిన శివానంద్ మల్లన్నవర్ అనే యువకుడు ఆర్సీబీ అభిమాని. ఆర్సీబీ అంటే అతనికి పిచ్చి అభిమానం. అయితే ఈ సీజన్‌లో ఆర్సీబీ ఫైనల్‌కు చేరుకొని.. హాట్ ఫేవరేట్‌లా కనిపిస్తున్న తరుణంలో ఆర్సీబీ ఫైనల్ గెలిస్తే.. సెలబ్రేట్ చేసుకోవడానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని కోరాడు. అన్ని జిల్లాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేయాలని అభ్యర్థిస్తూ వారు ముఖ్యమంత్రికి లేఖ రాయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం ఆ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆర్సీబీ ఐపిఎల్ కప్ గెలిస్తే, ప్రభుత్వం ఆ రోజును 'కర్ణాటక రాష్ట్ర ఆర్‌సిబి అభిమానుల పండుగ'గా అధికారికంగా



ప్రకటించి, ప్రతి సంవత్సరం సెలవు ఇవ్వాలి. =జడీ అభిమానుల చిరకాల స్వప్నం నెరవేరబోతున్నందున, ప్రతి జిల్లాలో కర్ణాటక రాజ్యోత్సవాన్ని జరుపుకునే విధంగానే =జడీఅభిమానుల పండుగను జరుపుకోవడానికి కర్ణాటక ప్రభుత్వం వీలు కల్పించాలని మేం అభ్యర్థిస్తున్నాం.

# ఆ టీమ్ ఫైనల్‌కి వస్తే.. కప్పు కష్టమే..!

మన గళం, ఆర్సీబీ ఐపీఎల్ 2025 ఫైనల్‌కు చేరుకుంది. అయితే, అశ్విన్ ముంబై ఇండియన్స్ ఫైనల్‌లో ఆర్సీబీని ఓడించే అవకాశం ఎక్కువగా ఉందని పేర్కొన్నాడు. ఆర్సీబీ ట్రోఫీ గెలవాలంటే ముంబై ఇండియన్స్ ఫైనల్‌కు చేరకుండా ఉండటం ముఖ్యం రవిచంద్రన్ అశ్విన్ అతను అభిప్రాయ పడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్సీబీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి కప్పు కొట్టాలనే కలకు కోహ్లీ అండ్ కో ఒక్క అడుగు దూరంలో నిలిచింది. అయితే.. ఆర్సీబీతో ఫైనల్‌లో పోటీ పడే జట్టు ఏదో తెలియాలంటే మరో రెండు మ్యాచ్‌ల వరకు ఆగాల్సిందే. ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య ఎలిమినేటర్‌లో జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు.. క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. అందులో గెలిచిన టీమ్ ఫైనల్ ఆడనుంది. అయితే అశ్విన్ ప్రకారం.. ముంబై ఇండియన్స్ ఫైనల్‌కు వస్తే మాత్రం ఆర్సీబీకి కప్పు కష్టమే అంటూ షాకింగ్ కామెంట్ చేశాడు. అలా ఎందుకు అన్నాడో ఇప్పుడు తెలుసుకుందాం.. గురువారం ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో ఓడించి ఆర్సీబీ నాలుగో సారి ఫైనల్‌కు చేరుకుంది. అయితే.. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ మాత్రమే ఫైనల్‌లో ఆర్సీబీని ఓడించగలదని భావిస్తున్నట్లు అశ్విన్ పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో లీగ్ దశలో ఆర్సీబీ, ముంబై ఇండియన్స్ ఒక్కసారి మాత్రమే తలపడ్డాయని, వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ గెలిచింది. ఆర్సీబీ ఐపీఎల్ ట్రోఫీ గెలవాలంటే, గుజరాత్ టైటాన్స్ ముంబై ఇండియన్స్‌పై గెలవాలి. ఎంఐ ఫైనల్‌కు రాకుండా వారిని ఆపాలి అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ 'ఆష్ కి బాత్'లో పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ మధ్య జరిగిన క్వాలిఫయర్ 1ని విశ్లేషిస్తూ పేర్కొన్నాడు. ఫైనల్‌లో ఆర్సీబీని ఓడించగల టీమ్ ఒక్క ముంబై మాత్రమే, ప్రస్తుతం ఆర్సీబీ హాట్



ఫేవరేట్‌గా కనిపిస్తున్నా.. క్రికెట్‌లో ఏదైనా జరగవచ్చు. ఒక ఆర్సీబీ ట్రోఫీ గెలవాలంటే.. ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌తో తలపడాలని కోరకుంటానంటూ అశ్విన్ తన మనసులో మాట బయటపెట్టాడు.

# 'కోహ్లీ నీ స్థాయికి ఇది తగదు'..



మన గళం, ఐపిఎల్ 18వ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫైనల్స్‌కు చేరింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫయర్‌లో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఆర్‌సిబి అభిమానులు పండగ చేసుకుంటున్నారు. అయితే ఈ మ్యాచ్‌లో కోహ్లీ ఓ యువ క్రికెటర్‌తో స్లెడ్జింగ్ చేయడంతో అతనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్, ఆర్‌సిబి బౌలర్ల ధాటికి కుప్పకూలిపోయింది. జట్టు బలహీనంగా ఉన్న క్రమంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడు ముషీర్ ఖాన్‌ను బరిలోకి దింపారు. అయితే ఆ సమయంలో స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కోహ్లీ అతనితో స్లెడ్జింగ్ చేశాడు. 'యే తో పానీ పిలాతా హే (ఇతడు నీళ్లు అందిస్తాడు)' అని అన్నాడు. కొన్ని ఓవర్లకు ముందే ముషీర్ ఖాన్ ఆటగాళ్లకు నీళ్లు అందించాడు. దీంతో కోహ్లీ అలా అన్నాడు. అయితే స్టార్ క్రికెటర్ అయిన కోహ్లీ ఓ యువ ఆటగాడిని ప్రోత్సహించాలి కానీ.. ఇలా కించపరచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కోహ్లీ స్థాయికి ఇది తగదు అని కామెంట్లు చేస్తున్నారు. అయితే కోహ్లీ ఫ్యాన్స్ మాత్రం అతడిని సమర్థించే ప్రయత్నం చేస్తున్నారు. ముషీర్ ఖాన్‌కు కోహ్లీ ఆరాధ్య క్రికెటర్ అని.. సీజన్ ఆరంభంలో కోహ్లీ తన బ్యాట్‌ని ముషీర్‌కి బహుమతిగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఒక అన్నలా తమ్ముడిలాంటి ముషీర్‌ను ఆటపట్టించాడని కామెంట్స్ చేస్తున్నారు.

# ఈ ఆరుగురి మధ్యే అసలైన పోరు..



మన గళం, ఈరోజు ముల్లాన్‌పూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్ చావో రేవోగా మారింది. ఓడిన జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. గెలిచిన జట్టు క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌తో తలపడుతుంది. ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్ కీలక దశకు చేరుకున్నాయి. క్వాలిఫైయర్ 1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లగా, ఇప్పుడు అందరి దృష్టి ఎలిమినేటర్ మ్యాచ్‌పై ఉంది. ఈరోజు ముల్లాన్‌పూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్ వర్సెస్ ముంబై ఇండియన్స్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్ చావో రేవోగా మారింది. ఓడిన జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. గెలిచిన జట్టు క్వాలిఫైయర్ 2లో పంజాబ్ కింగ్స్‌తో తలపడుతుంది. ఈ హై-స్టేక్స్ మ్యాచ్‌లో ఇరు జట్ల స్టార్ ఆటగాళ్ల మధ్య జరిగే వ్యక్తిగత పోరాటాలు మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేయగలవు. 1. శుభ్‌మన్ గిల్: దీపక్ చాహర్ గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్న బ్యాటర్లలో అతను ఒకడు. అయితే, ముంబై ఇండియన్స్ పేసర్ దీపక్ చాహర్‌తో అతని పోరు ఆసక్తికరంగా ఉండనుంది. గతంలో చాహర్, గిల్‌ను టీ20 క్రికెట్‌లో నాలుగు సార్లు ఔట్ చేశాడు. అయినప్పటికీ, గిల్ చాహర్ బౌలింగ్‌లో 101 పరుగులు (72 బంతుల్లో) సాధించాడు. ఇది అతని దూకుడు ప్రదర్శిస్తుంది. పవర్‌ప్లేలో ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగే పోరు మ్యాచ్‌కు టోన్‌ను సెట్ చేయగలదు. గిల్ తన దూకుడుతో పరుగులు రాబట్టి, చాహర్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని చూస్తుండగా, అదే సమయంలో చాహర్ గిల్ వికెట్ తీసి ముంబైకి శుభారంభం ఇవ్వాలని ప్రయత్నిస్తాడు.

2. సూర్యకుమార్ యాదవ్: ముంబై ఇండియన్స్ మిడిల్ ఆర్డర్‌కు సూర్యకుమార్ యాదవ్ వెన్నెముకగా మారాడు. అతను ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పరుగుల వరద పారిస్తున్నాడు. అయితే, గుజరాత్ టైటాన్స్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్‌తో అతని పోరాటం మ్యాచ్‌కు ప్రధాన ఆకర్షణగా మారింది. రషీద్ ఈ సీజన్‌లో అంత గొప్ప ఫామ్‌లో లేనప్పటికీ, అతను తనదైన రోజున ఎలాంటి బ్యాటర్‌నైనా ఇబ్బంది పెట్టగలడు. రషీద్ బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ గతంలో 117 పరుగులు (77 బంతుల్లో) చేశాడు. రషీద్ సూర్యను ఇప్పటివరకు ఔట్ చేయలేకపోయాడు. సూర్యకుమార్ అసాధారణ షాట్ మేకింగ్ సామర్థ్యం, రషీద్ ఖాన్ వైవిధ్యమైన స్పిన్ డెలివరీలకు మధ్య జరిగే ఈ పోరు మ్యాచ్ గమనాన్ని మార్చగలదు.


3. రోహిత్ శర్మ : ముంబై ఇండియన్స్ ఓపెనర్ రోహిత్ శర్మ, గుజరాత్ టైటాన్స్ పేస్ అటాక్‌కు నాయకత్వం వహించే మహ్మద్ సిరాజ్ మధ్య జరిగే పోరు కూడా చూడదగ్గది. రోహిత్ శర్మ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడటానికి పేరుగాంచిన సంగతి తెలిసిందే. సిరాజ్ కొత్త బంతితో వికెట్లు తీయడంలో దిట్ట. గత ఐపీఎల్ మ్యాచ్‌లలో రోహిత్, సిరాజ్ బౌలింగ్‌లో 86 పరుగులు (140.98 స్ట్రైక్ రేట్‌తో) సాధించాడు. అయితే, ఈ సీజన్‌లో చివరి పోరులో సిరాజ్ రోహిత్‌ను ఔట్ చేయగలిగాడు. 30 డాట్ బాల్స్ కూడా వేశాడు. ఈ మ్యాచ్‌లో ఎవరు పైచేయి సాధిస్తారనేది ముంబై ఇన్నింగ్స్ ప్రారంభానికి చాలా కీలకం. ఈ ఆరుగురు ఆటగాళ్ల పోరాటాలే కాకుండా, ఇరు జట్లలోని ఇతర కీలక ఆటగాళ్లు కూడా తమవంతు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారు. ఈ డూ-ఆర్-డై మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ మధ్య హోరాహోరీ పోరు ఖాయం. ఎవరు క్వాలిఫైయర్ 2కు అర్హత సాధిస్తారో చూడాలి..

# సినర్, గాఫ్ ముందుకు..మూడో రౌండ్‌లో జ్వరేవ్, పెగులా

మన గళం, ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుష సింగిల్స్‌లో టాప్ సీడ్ జన్నిక్ సినర్ (ఇటలీ), మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వరేవ్ (జర్మనీ) మూడో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా), మూడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) రెండో రౌండ్‌లో విజయం సాధించారు. ఇక పురుషుల సింగిల్స్‌లో 9వ సీడ్ డి మినార్ (ఆస్ట్రేలియా) రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. అగ్రశ్రేణి ఆటగాడు సినర్ రెండో రౌండ్‌లో అలవోక విజయం సాధించాడు. రిచర్డ్ గాస్కెట్ (ఫ్రాన్స్)తో జరిగిన పోరులో సినర్ 63, 60, 64తో జయకేతనం ఎగుర వేశాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సినర్ వరుసగా మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను చేసుకున్నాడు. మరో పోటీలో 17వ సీడ్ ఆంద్రీ రుబ్లేవ్ (రష్యా) జయభేరి మోగించాడు. ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ వాల్టన్‌తో జరిగిన రెండో రౌండ్‌లో రుబ్లేవ్ 76, 61, 76తో విజయాన్ని అందుకున్నాడు. జ్వరేవ్ కూడా మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. నెదర్లాండ్స్ ఆటగాడు జాస్పర్‌తో జరిగిన పోరులో జ్వరేవ్ 36, 61, 62, 63తో విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో కొకొ గాఫ్ అలవోక విజయంతో మూడో రౌండ్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో గాఫ్ 62, 64తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన టెరెజా వలెన్‌టోవాను ఓడించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన గాఫ్ వరుసగా రెండు సెట్లు గెలిచి ముందంజ వేసింది. మరో పోటీలో పెగులా 63, 76తో అమెరికాకే చెందిన అన్ లీను ఓడించింది. తొలి సెట్‌లో సునాయాసంగా గెలిచిన పెగులాకు రెండో సెట్‌లో కాస్త పోటీ ఎదురైంది. అయితే టైబ్రేక్‌లో సెట్‌ను గెలుచుకున్న పెగులా మూడో రౌండ్‌కు చేరుకుంది. ఆరో సీడ్ ఆండ్రీవా కూడా మూడో రౌండ్‌లో ప్రవేశించింది. రెండో రౌండ్‌లో ఆండ్రీవా 63, 64తో అమెరికా క్రీడాకారిణి క్రుగర్‌ను ఓడించింది.

## అన్న జేఏసి,రెడ్డి సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం విజయవంతం






ఆంధ్రప్రదేశ్ రాయలసీమ ఏరియా నంద్యాల జిల్లా నంద్యాల టౌన్ లోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మీనాక్షి సెంటర్ హుస్సేన్ రెడ్డి చికెన్ షాప్ ఎదురుగా కమర్షియల్ కాంప్లెక్స్ (7) లోని పెండ్లి సంబంధాలు కుదిరిస్తున్న మధ్యవర్తులైన మీడియేటర్స్ కలిసికట్టుగా నెలవారీ ప్రోగ్రాం గా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో నంద్యాల జిల్లాకు చెందిన, అన్న జేఏసి, రెడ్డి సంఘం మీడియేటర్స్ హెల్పర్ అసోసియేషన్, మ్యారేజ్ బ్యూరో నంద్యాల జిల్లా అధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, జిల్లా చైర్మన్ నట గంగాధర్, జిల్లా గౌరవ అధ్యక్షులు టి.వి. రమణ, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ అలీ, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య గౌడ్, నంద్యాల జిల్లా మహిళా గౌరవ అధ్యక్షురాలు భవాని, జిల్లా మహిళా కార్యదర్శి హుస్సేన్ అమ్మ, శ్రీనివాస శర్మ, పాల్గొనగా జీవీఆర్ చైర్మన్ రాజ్ కుమార్ ని గెస్ట్ గా ఆహ్వానించారు, కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమీల, హుస్సేన్, శేఖర్, లక్ష్మన్న, చెన్నారెడ్డి, బాలచంద్రశేఖర్, హుస్సేన్ బాబు, అలాగే తెలంగాణ రాష్ట్ర గద్వాల జిల్లా అధ్యక్షులు రామచంద్రుడు, జమ్మలమడుగు షరీఫ్, అనంతపురం జిల్లా నుండి భీమన్న యాదవ్, రంగనాథ్, బాల రెడ్డి, బాలచంద్ర, రామచంద్రయ్య, మల్లికార్జున, గుత్తి ఆర్ఎస్ స్వామి, అలాగే కడప జిల్లాకు చెందిన చిన్నపరెడ్డి, రామ ముని రెడ్డి, మరి కొంతమంది పాల్గొనగా, విజయవాడ నుండి , అన్న జేఏసి, రెడ్డి సంఘం స్థాపించిన వ్యవస్థాపకులైన ఈదర హర్షవర్ధన్ రెడ్డి, ఉండేలా సుబ్బారెడ్డి, ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆత్మీయ సమావేశంలో మీడియేటర్స్ సమస్యల గురించి ప్రసంగిస్తూ అసోసియేషన్ లోని మధ్యవర్తులైన పెళ్లి సంబంధాలు కుదిరిస్తూ చేస్తూ ఉన్నప్పటికీ కొంతమంది పెండ్లి చేసుకున్న వారు, పెండ్లి కుదిరించిన వారికి డబ్బులు ఇవ్వకపోవడం కూడా జరుగుతుందన్నారు. ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉండటంతో ప్రతి నెలకు మీటింగ్ పెడుతున్నా అలాగే ప్రతి మంగళవారం కూడా మీడియేటర్స్ సమస్యలు ఫోన్ కాల్స్ ద్వారా కొన్ని పరిష్కరిస్తున్నా అసోసియేషన్ లోని కొంతమంది మీడియేటర్స్ పేదవారుఏజ్ బార్ అయినవాళ్లకి కూడా అసోసియేషన్ నుండి వారి కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలనే ఆలోచనలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ మధ్యనే కర్నూలు జిల్లా టౌన్ లో రామేశ్వర్ రెడ్డి మరణించడంతో వారి కుటుంబం ఆర్థికంగా వెనకబడడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సాయం గా తమ అసోసియేషన్ లోని ఉన్న మీడియేటర్స్ అందరూ వారి వారి శక్తి కొలది అమౌంటు జమచేసి అసోసియేషన్ వారికి అందజేయడంతో అసోసియేషన్ వారు కూడా కొంత డబ్బు వేసుకొని మొత్తం,రూ. 22,480 వారి కుటుంబానికి అందించడం జరిగిందన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమాలను మరెన్నో చేయడానికి ముందుకు వస్తూ ఉన్నామన్నారు. ఇంకా మరికొన్ని వివరాలు అనంతపురం జిల్లా గుత్తి టౌన్ బీరప్ప మ్యారేజ్ బ్యూరో నారాయణ తెలిపారు,

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ జి. రాజకుమారి శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెన్యువల్ చేసిన అక్రిడేషన్ కాల పరిమితి మే 31వ తేదీ నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## మహానాడు విజయవంతం




- కర్నూలు పార్లమెంటు జిల్లా తెదేపా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి

మన గళం,కర్నూలు సిటి : తెలుగుదేశంపార్టీ కడపలో మే 27,28,29 వ తేదీల్లో జరిగిన మహానాడు గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తిగా విజయవంతమైయిందని, చివరి రోజు జరిగిన భహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్నటుల జరిగిందనీ, దీనికి కారణం తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు , పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎంతో ప్రణాళికా బద్ధంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసి మహానాడు విజయవంతానికి ఎనలేని కృషిచేశారనీ, ఈ మహానాడుకు కర్నూలు జిల్లా నుండి కూడా అంచనాలకు మించి నాయకులు, కార్యకర్తలు హాజరై జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొని వచ్చారని హాజరైన వారందరికి కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి జిల్లా తెలుగుదేశంపార్టీ తరుపున ప్రత్యేక దన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, వై.నాగేశ్వరరావుయాదవ్, కె.నాగేంద్ర, ఈశ్వర్,పి.రవికుమార్లతో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా, మీడియా ప్రతినిధుల సామావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి తెలుగుదేశంపార్టీకి చెందిన మంత్రివర్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీ యం.యల్.ఎ.లు, మాజీ యం.యల్.సి.లు, నియోజకవర్గం పార్టీ ఇన్చార్జిలు, తెలుగుదేశంపార్టీకి చెందిన అన్నిస్థాయిల నాయకులు, కార్యకర్తలు, అభునంధ సంగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానలు, మహానాడు వేదుకు తమ తమ అనుచరలుతో హాజరై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారనీ తెలియజేశారు. వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కొంతమంది వై.సి.పి. నాయకులు వెన్నుపోటు దినం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అయితే దానికంటే ముందుగా వివేక బాబాయ్ గోడ్డలిపోటు దినం నిర్వహించి, ద్రోహులెవరో తేల్చాలనీ సవాల్ విసిరారు. 5 సంవత్సరాలు అధికారంలో ఉన్న జగన్ ఎందుకు నిగ్గుతేల్చలేదని ప్రశ్నించారు. కడప మహానాడుతో బెంబేలెత్తిపోయిన జగన్మోహన్రెడ్డి ఎక్కడ దాక్కున్నారో వై.సి.పి. వారికి దిక్కుతోచడం లేదనీ, తెలుగుదేశం సత్తాఏమిటో ఒక మహిళ ఆధ్వర్యంలో మహానాడు నిర్వహించి నారీశక్తి ఎలా ఉంటుందో జగన్కు తెలిసి వచ్చేలా ఈ మాహానాడు ద్వారా చంద్రబాబునాయుడు బుద్ధి చెప్పారనీ, తెలుగుదేశం జెండా లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్కు ఆ పసుపుజెండా సత్తాదఏమిటో కడప గడ్డమీదనే చూపించారనీ, ఇంకా సిగ్గులేకుండా వై.సి.పి. వారు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ ఉన్నారు. వై.యస్.ఆర్.సి.పి. నాయకులు అధికార మదంతో చేసిన పాపాలకు శిక్షలు అనుభవిస్తున్నారనీ, రోజుకోకరు జైలకు, కోర్టు చుట్టూ బెయిళ్ల కోసం ప్రదక్షణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక వై.సి.పి. నాయకులకు జైలు, బెయిలు తప్ప, రాజకీయ జీవితం శూన్యమని, ప్రజాజీవనంలోకి రావడం కల్ల అని తెలియజేశారు. ఈ రోజు మహానాడు భారతదేశంలో ఎక్కడ కూడా జరుగని విధంగా జరుపుకోవడం, ఒక చరిత్రగా నిలిచిపోయిందనీ, ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రధానమంత్రిని సైతం ఆశ్చర్యానికి గురిచేశాయనీ, కేవలం అధికారంలోకి వచ్చిన 11 నెలలోనే ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేశారని, ఇప్పటికే సామాజిక పేన్షన్లు పెంచడం, అన్నక్యాంటీన్లు తెరవడం, జి.ఓ. నెం.1ని రద్దు చేయడం, డి.యస్.సి. ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం, దీపం పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం వంటివాటిని అమలు చేశామని, రానున్న జూన్ మాసంలో తల్లికి వందనం, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అలాగే రైతాంగానికి ప్రకటింన 20 వేల రూపాయలను వారి కాతాల్లో జమ చేయడం జరుగుతుందనీ తెలిపారు. అయితే ప్రతిపక్ష హొదా కూడా లేని వై.సి.పి. వారు ప్రజలను ఎన్నో రకాల ఇబ్బందులకు గురిచేసినందు వల్లనే ఈ రోజు వారికి 11 సీట్లు ఇచ్చారు. అయినా వారికింకా జ్ఞానోదయం కలుగలేదనీ, ప్రజలు మర్చిపోతున్న సమయంలో మరలా మేము ఇంకా ఉ నామనీ చెప్పుకోవడానికి, ఉనికి కాపాడుకోవడానికి తప్ప వై.సి.పి. వారికి ప్రజల పట్ల, వారి సమస్యల పట్టల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనీ ఇక వలారి మాటలు నమ్మే స్థితిలో ఈ రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరనీ మహానాడు విజయవంతంతో మరోసారి రుజువు చేశారనీ తెలిపారు. ఇకనైనా చౌకబారు కార్యక్రమాలు మానుకోవాలని హితవు కోరారు.

## యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మన గళం,కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ నెల 21 నుండి నెల రోజుల పాటు నిర్వహించే యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుండి యోగాంధ్ర - 2025, పీఎం సూర్య ఘర్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికై ఈ నెల 21న ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకు వెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు అంతా సమిష్టిగా ముందుకు అడుగులు వేయాలన్నారు. విశాఖపట్నం వేదికగా జూన్ 21 న జరుగనున్న 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ పాల్గొంటున్న సందర్భంగా ప్రపంచానికి యోగ విశిష్టతను తెలియపర్చే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామంలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రజలు అందరూ యోగా అనేది ఒక జీవిత విధానంగా అనుసరించేలా ఈ శిక్షణా కార్యక్రమాలు జరిగే విధంగా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు.ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క థీమ్ తో 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి జిల్లా కలెక్టర్ అందరికి కమ్యూనికేట్ చేయడం జరిగిందని, ఆ కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలుపరచాలని ఆదేశించారు.పీఎం సూర్య ఘర్ పథకం అమలు వేగవంతం చేయాలని సిఎస్ ఆదేశించారు.. వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లను ఆదేశించారు..వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310